


# ప్రకృతి ధర్మం

కస్తూరి మురళీకృష్ణ

**మళ్లీ రివ్వున కిటికీలోంచి లోపలకు దూసుకు వచ్చింది పిట్ట. దాని వెంటనే మరో పిట్ట రెక్కలల్లారుస్తూ లోపలకు వచ్చింది.**

రెండూ గదంతా ఒకదాని వెంట మరొకటి తిరిగాయి. ఓ మూల నుంచి మరో మూలకు ఎగిరాయి. ఫ్యాను రెక్కమీద విశ్రాంతి తీసుకుంటూ గదంతా కలయ చూసి మళ్ళీ తమ ఆటను ఆరంభించాయి.

"రెండూ జంట కట్టినట్టున్నాయి. గూడు కోసం వెతుకుతున్నట్టున్నాయి" వాటినే పరిశీలనగా చూస్తూ అన్నాడు శంకర్.

"పెద్ద న్యూసెన్సుగా ఉంది. ఒక్క క్షణం నిద్రపోనివ్వవు. తరిమెయ్ వాటిని" చిరాగ్గా అన్నాడు సుధీర్.

"న్యూసెన్సేమిటోయ్... నేర్చుకుంటే బోలెడన్ని పాఠాలు నేర్పగలవు అవి" నవ్వుతూ అన్నాడు శంకర్.

"పాఠాలు నువ్వు నేర్చుకో. అయినా నువ్వు ప్రొద్దున్న పోతే, సాయంత్రం వస్తావు. కదిలే వీలు లేకుండా నుంచం మీద పడుండి పిట్టల పోరు భరించేది నేను కదా!" నిస్పృహ ధ్వనించింది సుధీర్ కంఠంలో.

"నేనూ వాటిని ఇంట్లోకి రానివ్వకూడదనే నిశ్చయించుకున్నాను. అవకాశం దొరికిన చోటల్లా గూడుకట్టి ఇల్లంతా పాడు చేస్తున్నాయి. రేపు ప్రొద్దున్న ఏదో చేస్తాలే"

అన్నాడు శంకర్. ఇంతలో మళ్ళీ లోపలకు దూసుకువచ్చింది పిట్ట. దాని ముక్కున గడ్డి పోచ ఉంది. గర్వంగా అటూ ఇటూ చూసి గదిలో ఓ మూలకు ఎగిరింది.

❀ ❀ ❀

సుధీర్ ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టాక అతనికి మరో అమ్మాయి అంటే ఇష్టం పెరిగింది. అతని భార్య శకుంతల మంచి ఉద్యోగంలో ఉంది. అందమైనదే. కాని సుధీర్‌కు పెళ్ళి ఓ ఊపిరి ఆడని బంధంలా కనిపించసాగింది. రెక్కలు కట్టేసి, స్వేచ్ఛను దొంగిలించే శిక్షలా తోచసాగింది. భార్యను విడాకులు అడిగాడు. ఆమె ఇవ్వనంది. "తాత్కాలిక ఆకర్షణలో పడి శాశ్వత బంధాన్ని వదులుకోవాలనుకుంటున్నారు. క్షణికావేశంలో జీవిత బంధం తెంపుకోవాలనుకుంటున్నారు. అందుకు నేను ఒప్పుకోను. మీకు నేనన్నా, పిల్లలన్నా, ఇష్టం లేకపోయినా, మన అభిప్రాయాల ప్రభావం మన సంసారంపై పడటం నాకిష్టం లేదు. పిల్లలకు తల్లిదండ్రులు రెండు కళ్ళ లాంటివారు. వీలయినంత వరకూ పిల్లలను తండ్రికి దూరం చేయటం నాకు ఇష్టం లేదు. మీరే తిరుగుళ్లయినా తిరగండి కానీ పిల్లలను తండ్రికి దూరం చేయకండి. మిగతా బాధ్యతలన్నీ నేను ఒంటరిగా నెరవేర్చగలను" అంది నిబ్బరంగా అతని భార్య.


కానీ పిల్లలు తన ఆనందానికి ప్రతిబంధకాలుగా కనిపించారు సుధీర్‌కి. అందుకే వాళ్లని వదలి వచ్చేశాడు. రేఖతో 'లివ్ఇన్' బంధం కోసం తహతహలాడుతున్నాడు.

"పశువులు, పక్షులు, జంతువులు చూడు. ఎంత హాయిగా, స్వేచ్ఛగా, ఏ బంధాలు లేకుండా బ్రతుకుతాయో! నేనూ, రేఖ అలాగే ఏ బరువులు, బాధ్యతలు లేకుండా బ్రతకాలనుకుంటున్నాం. ఓ రెండ్రోజులు నీ ఇంట్లో ఉంటాను. ఇంతలో ఏదైనా ఇల్లు చూస్తానంది రేఖ". జరిగింది విని సుధీర్‌కి నచ్చచెప్పాలని ప్రయత్నిస్తున్న శంకర్‌తో అన్నాడు సుధీర్.

శంకర్ ఒప్పుకున్నాడు. అయితే తరువాత రోజే ఇంటి బయటే గేరు సరిగ్గా మార్చక పోవటంతో స్కూటర్ ఎగిరిపడింది. సుధీర్ పడ్డాడు. కాలు విరిగింది. దాంతో కనీసం రెండు మూడు వారాలు మంచం మీదే కదలకుండా ఉండాల్సి వచ్చింది.

## వేకువనే బాగుంటది!

ప్రియాంక కొత్త బాయ్‌ఫ్రెండ్ హారీబావేజ్ కొడుకుతో చెట్టపట్టాలేసుకుని తిరుగుతోందన్నది బాలీవుడ్ ఉవాచ. ప్రతి రోజూ ప్రియాంక ఇంటికి వేకువజాము 3 గంటలకి ఫోన్ రావడం, తుర్రుమంటూ ఆమె కారులో వెళ్ళిపోవడం పనివాళ్ళకి వింతగా అనిపించిందట. ఆ టైంలో అయితే ప్రేయసితో ఫ్రెష్‌గా మాట్లాడుకోవచ్చని ఆయనగారు కాల్ చేస్తున్నారని ప్రియాంక ఫ్రెండ్స్‌తో చెప్పిందట. ఛా!



"రెండు వారాలు కనిపెట్టుకుని ఉండటం కుదరదు" అంది రేఖ.

"శకుంతలకు చెప్పవద్దు. ఆ చాప్టర్ అయిపోయింది" అన్నాడు సుధీర్, శకుంతలకు చెప్తానన్న శంకర్‌ను వారిస్తూ.

దాంతో శంకర్‌కున్న ఒకే గదిలో ఇద్దరూ ఉండాల్సి వస్తోంది.

❀ ❀ ❀

"ఈ పిట్టలు నన్ను చంపుతున్నాయి. వీటి పని పట్టు" రెండు రోజుల తరువాత శంకర్‌కు గుర్తు చేశాడు సుధీర్.

"రేపు ఆదివారం కదా. అంతా శుభ్రం చేస్తాను. కిటికీలకు, వెంటిలేటర్‌కూ అడ్డుపెడతాను" అన్నాడు శంకర్.

❀ ❀ ❀

తెల్లారి లేస్తూనే గది సర్దటం ఆరంభించాడు శంకర్.

"ఇక్కడ పెట్టాయి గూడు" దాదాపు కప్పును తాకుతూ ఉన్న పై అరలోకి చూస్తూ చెప్పాడు శంకర్.

"లాగిపడెయ్. పీడా పోతుంది" అన్నాడు సుధీర్ విసుగ్గా.

"నిజంగా వీటి తెలివికి మెచ్చుకోవాలి. ఒక్కో గడ్డిపుల్లతో, ఆకులతో ఎంత దిట్టమైన గూడును కట్టాయో! దాన్ని మనం క్షణంలో పీకి పారేస్తాం" అంటూ లాగబోయిన శంకర్ ఆగిపోయాడు.

"ఏమైంది?" అడిగాడు సుధీర్.

"ఇవి గుడ్లు పెట్టాయి"

"అయితే?"

పైనుంచి దిగాడు శంకర్.

"ప్రపంచంలోని ఏ జీవి అయినా ఎంతో అపురూపమైనది. మనకు లక్ష్యం లేదు కానీ, మనం అసహ్యించుకునే చిన్న చిన్న క్రిమికీటకాదులను కూడా భగవంతుడు, మనల్ని ఎంత శ్రద్ధతో తయారు చేశాడో, అంతే శ్రద్ధతో తయారు చేస్తాడు".

"ఇకనీ ఉపన్యాసం చాలు. ఇప్పుడేమంటావు?"

"గుడ్లని పిల్లలు కానీ. అప్పుడు తలుపులు మూసేద్దాం. ఇప్పుడు మూసేస్తే పిల్లలకు తిండి పెట్టేందుకు అవి రాలేవు."

"నీ ఇష్టం. వాటితో చచ్చేది నేను. నీకేం?" నిష్ఠూరంగా అన్నాడు సుధీర్. రివ్వున ఎగురుకుంటూ రెండు పక్షులు లోపలకు వచ్చాయి.

❀ ❀ ❀

'కిచకిచ' మంటూ శబ్దం వినిపిస్తోంది. గుడ్లు పిల్లలయినట్టున్నాయి.

క్షణక్షణానికి రెండు పక్షులు ఒకదాని

తరువాత మరొకటి బయటకు వెళ్తున్నాయి. లోపలకు వస్తున్నాయి.

ఇప్పుడు సుధీర్‌కు వాటిని చూస్తుంటే చిరాకు కలగటం లేదు. ఒక అద్భుతాన్ని చూస్తున్నట్టుంది.

సాయంత్రం శంకర్ రాగానే చెప్పాడు. "ప్రొద్దుట నుంచీ అలుపూ, సొలుపూ లేకుండా, విసుగూ విరామం లేకుండా అవి పిల్లలకు పురుగులు తెచ్చి పెడుతూనే ఉన్నాయి. ఎంత తింటాయని?"

శంకర్ నవ్వాడు. "పిల్లలది ఎదిగే శరీరం. ఈ సమయంలోనే తిండి ఎక్కువ కావాలి. అందుకే అవి నిరంతరం తినిపిస్తూనే ఉంటాయి."

"నిజంగా ఎంత అద్భుతంగా ఉంది. రెండు పిట్టలు ఏదో పథకం వేసుకున్నట్టు ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే ఉన్నాయి. తినిపిస్తూ పోతూ ఉన్నాయి." అన్నాడు సుధీర్ అబ్బురంగా. ఇద్దరూ అన్ని పనులూ మానేసి నిరవధికంగా తిండి తెస్తూ, పిల్లలకు పెడుతున్న ఆ పక్షులను చూస్తూ కూచున్నారు.

"నిజంగా సృష్టి ఎంత చిత్రమైనది! ప్రతి జీవికీ ఏ క్షణంలో ఏం చేయాలో తెలుసు. ప్రతి జీవి బ్రతికేది తన సంతానం కోసమే. సంతానం కోసం ఏ త్యాగమైనా చేస్తాయి. కానీ ఆలోచించగలిగే మనిషి తన స్వార్థాన్ని సమర్థించుకునేందుకు సిద్ధాంతాలు సృష్టించి, వాదాలు చేస్తాడు" వాటినే చూస్తూ, ఆలోచిస్తూ అన్నాడు శంకర్.

సుధీర్ ముఖం మాడిపోయింది. కానీ శంకర్ అన్న మాటల్లో అసత్యం ఏముంది?

రాత్రి పది దాటుతున్నా పక్షుల రాకపోకలు మానలేదు. "వాటి ఓపికకూ, శక్తికి మెచ్చుకోవాలి" నిద్రకు ఉపక్రమిస్తూ అన్నాడు సుధీర్.

"లైటార్పేస్తున్నా, గుడ్‌నైట్" లైట్ ఆర్పేశాడు శంకర్.

వెంటనే ఇద్దరి మనస్సులలో ఒకే ప్రశ్న ఉదయించింది.

ఇంతవరకూ వెలుతురు ఉంది కాబట్టి పక్షులు సీలింగ్ ఫాను తాకకుండా కిటికీ నుంచి గూడు చేరుకున్నాయి. ఇప్పుడు వెలుతురు లేదు. వాటికి దారిలో అడ్డు ఎలా తెలుస్తుంది? పైగా ఫ్యాను స్పీడుగా తిరుగుతోంది.

క్షణంలో వారి సందేహానికి సమాధానం దొరికింది.

"ఖట్" మన్న శబ్దం వినిపించింది.

వెంటనే లైట్ వేశాడు శంకర్. అదే చేత్తో ఫాను ఆపేశాడు.

"ఏమైంది? పక్షి ఫ్యానుకు కొట్టుకుని ఉంటుందా?" కంగారుగా అడిగాడు సుధీర్.

"ఏమో!" అన్నాడు శంకర్. అతడి గుండె దడదడలాడుతోంది. ఎందుకో మనసంతా బాధతో నిండిపోయింది.

"పక్షి ఫ్యానుకి కొట్టుకుంది. అదీ శబ్దం. ఆ దెబ్బకి అది ఎక్కడో పడి ఉంటుంది. చచ్చిపోయి ఉంటుందా?" కంగారు, ఆందోళన స్పష్టంగా తెలుస్తున్నాయి సుధీర్ మాటల్లో. శంకర్ గది అంతా వెదికాడు. ఎక్కడా పక్షిలేదు.

"పైన వెతుకు" అన్నాడు సుధీర్.

పైన ఎక్కి చూశాడు శంకర్. పిట్ట శరీరం లేదు. ఓసారి పిట్ట గూట్లోకి తొంగి చూశాడు.

బారగా నోళ్ళు తెరిచాయి పిట్టలు. తల్లో, తండ్రో తిండి తెచ్చాయనుకున్నట్టున్నాయి అతని అలికిడికి.

మనస్సులో మరో బాధ మొదలయింది. మౌనంగా దిగాడు శంకర్.

ఇంతవరకూ పిట్ట చచ్చిపోయిందన్న బాధకు, మరో పిట్ట రాకపోతే వీటికి తిండి ఎట్లా? అన్న బాధ తోడయింది. అవి ఆకలికి మలమల మాడి చస్తాయా?

వాటి మనస్సుల్లో ఎటువంటి ఆలోచనలు చెలరేగుతాయో! వాటికి ఎంత బాధ కలుగుతుందో!

"పిట్ట శవం దొరకలేదు కాబట్టి, అది ఫాను తగలగానే కిటికీలోంచి పారిపోయిందని అనుకోవచ్చు" ఆలోచిస్తూ అన్నాడు సుధీర్.

ఆ రాత్రి ఇద్దరూ నిద్రపోలేదు. లైటార్పలేదు. ఫ్యాను వేయలేదు. ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

"ఇప్పుడు ఆ పక్షి మళ్లీ వస్తుందా? రాకపోతే పిల్లలకెలా?" హఠాత్తుగా అర్ధరాత్రి అడిగాడు సుధీర్.

సుధీర్ వైపు నిశితంగా చూశాడు శంకర్. "తల్లిదండ్రులున్నా అనాథలుగా బ్రతికేవారు బ్రతకటం లేదూ? చూద్దాం పిట్ట ఇంకా వస్తుందేమో!" అన్నాడు.

సుధీర్ పైకప్పు కేసి చూస్తూ ఆలోచిస్తూండిపోయాడు.

❋ ❋ ❋

తెల్లారి కిటికీ బయట వెతికాడు శంకర్. పిట్ట శవం దొరకలేదు. అంటే అది చావలేదన్న మాట! అనుకున్నాడు.

"పిట్ట వచ్చింది" లోపల నుంచి సంతోషంగా అరిచాడు సుధీర్.


ఒకే పిట్ట వచ్చింది. అది రావటంతోటే పిల్లల కిచకిచలు అధికమయ్యాయి.

"పిల్లలు బ్రతుకుతాయి" సంతోషంగా అన్నాడు సుధీర్.

అతని వైపు ఆలోచనగా చూశాడు శంకర్.

"ఒకే పిట్ట వస్తోంది" శంకర్ ఆఫీసుకి వెళ్తుంటే అన్నాడు సుధీర్. "ఇంకో పిట్ట ఏమై ఉంటుంది?" అడిగాడు.

"శవమైతే దొరకలేదు. బహుశా అది



భయపడిపోయి ఉంటుంది. ఇక రాదనుకుంటాను. ఒకటయితే వస్తున్నది కదా!" అన్నాడు శంకర్.

"మరి దీనికి భయం లేదా?"

"దేవుడు అందుకే పిల్లలకు తల్లిదండ్రులని ఇద్దరిని ఇచ్చి ఉంటాడు. ఒకరు ఏ కారణం చేత వదిలి వెళ్ళినా, ఇంకొకరు పిల్లలకు అండగా నిలబడతారు" సుధీర్ వైపు చూశాడు శంకర్.

సుధీర్ మాట్లాడలేదు.

బయటకు వెళ్తూ వెనక్కు తిరిగి చూశాడు శంకర్. లోపలకు వచ్చి పిల్లలకు తిండి పెడ్తూ, మరికొంత తిండి తెచ్చేందుకు బయటకు ఎగురుతున్న పిట్టవైపు చూస్తూ పడుకుని ఉన్నాడు సుధీర్. అతని ముఖం గంభీరంగా ఉంది.

❋ ❋ ❋

"ఒకే పిట్ట వస్తోంది. రెండోది రావటం లేదు" దిగులుగా చెప్పాడు రాత్రి సుధీర్.

శంకర్ మాట్లాడలేదు. పుస్తకం చదువుతూండిపోయాడు.

సుధీర్ మాత్రం ఏకాగ్రతతో పిట్టనే చూస్తున్నాడు.

❋ ❋ ❋

"ఇవాళ ఓ పిల్ల పిట్ట ఎగిరి గూడు దాటి వచ్చింది. ఎంత ముద్దుగా ఉందో!" సంతోషంగా చెప్పాడు సుధీర్. శంకర్ ఇంకా పూర్తిగా ఇంట్లో అడుగుపెట్టకముందే.

"గూడు నుండి బయటకు వచ్చి ప్రపంచాన్ని వింతగా చూసి చిన్నగా ఎగిరింది" మురిసిపోతున్నాడు సుధీర్. 'కానీ ఈ అద్భుతాన్ని ఆ ఇంకో పిట్ట చూడలేదు' మళ్ళీ తనే అన్నాడు. శంకర్ మౌనంగా ఉండిపోయాడు.

❋ ❋ ❋

"పిట్టలన్నీ ఎగిరిపోయాయి" శంకర్ అలికిడి విని గట్టిగా అరిచాడు సుధీర్.

"రేపు పైన శుభ్రం చేసేస్తాను. కిటికీలు, వెంటిలేటర్ మూసేస్తాను" చెప్పాడు శంకర్.

"నిజంగా ఆ ఇంకో పిట్ట గ్రేట్. మొదటి పిట్ట ప్రాణభయంతో మళ్ళీ రాలేదు. అయినా ఒక్కతే తన బాధ్యతను సంపూర్ణంగా నెరవేర్చింది. తన సంతానాన్ని బ్రతికించుకుంది" మెచ్చుకోలుగా అన్నాడు సుధీర్.

"ప్రకృతి ధర్మం అది. ఎవరో ఒకరు బాధ్యతను చేపడతారు. ఎవరూ లేకపోతే ప్రకృతి కాపాడుతుంది. ఎవరు లేకపోయినా సృష్టి ఆగదు. తన కర్తవ్యం నుంచి పారిపోయిన వాడికి నష్టం తప్ప, ప్రకృతికి నష్టం లేదు. అందుకే అంటారు, దిక్కులేనివాడికి దేవుడే దిక్కు" అని చెప్పాడు శంకర్.

సుధీర్ ఆలోచనగా శంకర్ వైపు చూస్తూండి పోయాడు.

❋ ❋ ❋

**జీవితం**



**కలల**
**అలల**
**అగాధ నైరాశ్యపు**
**కొండచరియల్లో**
**ఎగిరిపడ్డ మంచుముక్క**
**క్షణంలో నీరుగా మారే**
**వెర్రిమొలక**
**అదే**
**ఎప్పటికీ**
**ఇంకెప్పటికీ**
**అర్థంకాని**
**ఈ మూడు అక్షరాల**
**పిచ్చి జీవితం**

**- డి. చందువంశీ**

మరుసటి రోజు పైకెక్కి పుస్తకాలన్నీ తీసి గూడును శుభ్రం చేశాడు శంకర్. ప్రక్క అరలో కూడా బూజు కనిపించింది. బూజు దులపాలని పుస్తకాలను తీస్తుంటే కనిపించింది పిట్టశవం!

శంకర్ మనస్సు పాడయిపోయింది. ఇన్నాళ్ళూ అది ఇక్కడ పడి ఉంది. అది భయపడిందో, పారిపోయిందోనని తామూహించారు!

"ఏమైంది?" నిలుచుండి పోయిన శంకర్‌ను అడిగాడు సుధీర్.

"ఇక్కడ చచ్చిపడి ఉంది. మనం పైన వెతికాం కానీ పుస్తకాలు తీసి చూస్తే కనిపించేది. వీటి వెనుక పడి ఉంటుందని ఊహించలేదు. నిర్లిప్తంగా చెప్పాడు శంకర్.

సుధీర్ కళ్ళల్లో నీళ్ళు కదలాడాయి.

"ఇది ఇక్కడ చచ్చిపడి ఉందని మనకి తెలియదు. బ్రతికి ఉన్న పిట్టకూ తెలిసి ఉండదు. అది ఏమనుకుని ఉంటుందో?" ఆలోచిస్తూ అన్నాడు సుధీర్.

ఇంకో కొత్త పిట్టతో పారిపోయిందని అనుకుని ఉంటుంది. అయినా సరే తన ధర్మం తాను పాటించింది. నిజం సుధీర్... మనం మన జీవితం, మన ఎంజాయ్‌మెంట్ అని స్వార్థంతో ఆలోచిస్తాం కానీ, మన ప్రతి చర్య ప్రభావం మన తరువాత తరంపై ఉంటుందని, మనం భవిష్యత్తులో వారికి జవాబివ్వాల్సి ఉంటుందని ఆలోచించం."

సుధీర్ మౌనంగా ఉన్నాడు.

"సృష్టిలో సంతానోత్పత్తి జీవుల ప్రథమ కర్తవ్యం. ఆ సంతానాన్ని పెంచి పెద్ద చేయటం జీవనధర్మం. దీన్ని మించిన ఎంజాయ్‌మెంట్, సాధించదగ్గ లక్ష్యం మరొకటి లేదు" అని పిట్ట శవం పారేసేందుకు బయటకు వెళ్ళాడు శంకర్.

గదిలోకి తిరిగి వచ్చేసరికి ఎవరితోనో మాట్లాడుతున్నాడు సుధీర్.

తెల్లారి ఆఫీసుకి వెళ్తున్న శంకర్‌తో చెప్పాడు సుధీర్. "బహుశా నువ్వు సాయంత్రం వచ్చేసరికి నేను ఉండకపోవచ్చు".

ప్రశ్నార్థకంగా చూశాడు అతని వైపు శంకర్.

"శకుంతల వస్తోంది. నన్ను తీసుకుని వెళ్లేందుకు" తలవంచుకుని చెప్పాడు సుధీర్.

నవ్వాడు శంకర్. "గుడ్‌లక్" అంటూ బయటకు వచ్చాడు.

బయటకు వచ్చిన శంకర్‌కు మందార చెట్టుపైన కిచకిచలాడుతూ రెండు పిట్టలు కనిపించాయి. బహుశా తన "ఇంట్లో పెరిగిన పిట్టలు పెద్దవయ్యాయేమో!" అనుకున్నాడు శంకర్.

అవి ముక్కుతో గడ్డి పోచలు పట్టుకుని ఉన్నాయి.

ప్రకృతి తన ధర్మం నెరవేరుస్తూ పోతోంది.